నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, గురువారం 26 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

విదేశాలలో ఉద్యోగాలకు 28న ఇంటర్వ్యూలు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 25 : విదేశాలలో ఉద్యోగాల కోసం ఈ నెల 28న కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా ఉన్న నెహ్రూ యువ కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి వై తిరుపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఆన్‌లైన్ చేసుకున్న కార్మికులకు గల్ఫ్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రోమేనియా, యూకే వంటి వివిధ దేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ నమోదిత ఏజెన్సీలతో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులని, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. అభ్యర్థులు తమ బయోడేటాను tomcom.resume@gmail.coms కు పంపాలని, వివరాలకు www.tomcom.telangana.gov.inలో లేదా 70133 61343, 79959 57779 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రెండు బడులు.. ఒకే మూత్రశాల

- ఒంటికి, రెంటికి వస్తే ఆపుకోవాల్సిందే
- 139 మంది విద్యార్థులకు తప్పని అవస్థ
- ఆడపిల్లల పరిస్థితి మరీ దారుణం
- భరించలేక ఈ బడికి రామంటున్న బాలికలు
- జాబితాపూర్ బడి అధ్వానం
- పరిస్థితి తెలుసుకుని చలించిన ఎమ్మెల్సీ కవిత
- పాఠశాలను సందర్శించిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

ఒకే కాంపౌండ్‌లో రెండు ప్రభుత్వ బడులు.. మొత్తం 139 మంది పిల్లలు.. ఉన్నది ఒకే మూత్రశాల.. ఇక విరామ సమయం వచ్చిందంటే చాలు వాష్‌రూం కోసం విద్యార్థులు చాంతాడంత లైన్‌లో నిల్చుండాల్సిందే. ఒకరి తర్వాత ఒకరు అంటే దాదాపు గంటకుపైనే నిరీక్షించాల్సిన హీనస్థితిలో జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ స్కూల్ మగ్గుతున్నది. ప్రభుత్వ పాలనకు, అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఆడపిల్లల పరిస్థితి అయితే మరీ దారుణంగా తయారు కాగా, బడికి రాలేమని, వసతులు వెంటనే కల్పించాలన్న డిమాండ్ వినిపిస్తున్నది. కాగా, విద్యార్థుల అవస్థలపై ఇటీవల పలు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలను చూసి ఎమ్మెల్సీ కవిత చలించిపోగా, ఆమె సూచన మేరకు బుధవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత స్కూల్‌ను సందర్శించారు. స్టూడెంట్స్ బాధలు కండ్లారా చూసి తన ఆవేదనను వెలిబుచ్చి, పిల్లలకు ధైర్యం చెప్పారు.

మూత్ర విసర్జనకు క్యూలో నిలుచున్న విద్యార్థినులు

చలించిపోయిన ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 25: జాబితాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను ఒకేచోట నిర్వహిస్తున్నారు. హైస్కూల్‌లో 77 మంది, ప్రాథమిక పాఠశాలలో 62 మంది మొత్తం 139 మంది విద్యనభ్యసిస్తున్నారు. అందులో 77 మంది బాలురు, 62 మంది బాలికలు ఉన్నారు. హైస్కూల్‌లో 36 మంది బాలికలు ఉన్నారు. ఈ రెండు పాఠశాలలకు కలిపి ఒకే ఒక మూత్రశాల ఉండడంతో విద్యార్థులు మరీ ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోగా వాటిని కూల్చివేయడంతో ఉన్నత పాఠశాలలో ఉన్న ఈ ఒక్క మూత్రశాలే దిక్కయ్యింది. విరామ సమయంలో మూత్ర విసర్జన చేసేందుకు విద్యార్థినులు క్యూలో నిలబడి, నిరీక్షించాల్సి వస్తుంది. క్యూలో నిలబడే ఓపిక లేక చాలా మంది సమీపంలోని తమ ఇండ్లకు వెళ్లివస్తున్నారు. పాఠశాల కాంపౌండ్‌కు ఆనుకొని గుట్ట బోరు ఉండడంతో బాలురు ఒంటికి, రెంటికి అక్కడికే వెళ్తున్నారు. వానకాలం కావడంతో గుట్ట ప్రాంతం చెట్లు, గడ్డితో నిండి ఉండడంతో ఇటీవలి కాలంలో బాలురు అటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. కొందరు ఆడపిల్లల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. బడికి వచ్చేటప్పుడు ఇంటి వద్ద మూత్ర విసర్జన చేసి వస్తున్నామని, బడిలో దాహమైనా నీళ్లు తాగడంలేదని చెబుతున్నారు. మళ్లీ బడి ముగిసి ఇంటికి వెళ్లిన తర్వాతనే నీళ్లు తాగుతున్నామని పలువురు బాలికలు తమ ఆవేదనను వెలిబుచ్చారు.

చలించిపోయిన ఎమ్మెల్సీ కవిత

జాబితాపూర్ ప్రభుత్వ బడుల్లో మూత్ర విసర్జన కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వెలుగు చూశాయి. పలు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు వైరల్ కావడంతో ఎమ్మెల్సీ కవిత చూసి చలించారు. సమస్యను తెలుసుకొని విద్యార్థులకు అండగా నిలువాలని సామాజిక మాధ్యమం ద్వారా జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతకు సూచించగా, బుధవారం ఆమె స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను కండ్లారా చూసి ఆమె సైతం చలించిపోయారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, అధైర్య పడొద్దని దావ వసంత విద్యార్థులకు భరోసానిచ్చారు.

139 మంది పిల్లలకు ఒకే టాయిలెటా?

- విద్యార్థుల పరిస్థితి చూస్తే హృదయం చలించిపోతున్నది
- వెంటనే అవసరమైన టాయిలెట్స్ నిర్మించాలి
- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 25: '139 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒకటే టాయిలెట్ ఉంటుందా..? మరీ ఇంత ఘోరమా..? పిల్లల పరిస్థితి చూస్తే హృదయం చలించిపోతున్నది' అని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆవేదన చెందారు. వెంటనే అవసరమైన టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సమస్యలపై పలు పత్రికల్లో వచ్చిన కథనాలను చూసి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చలించిపోగా, ఆమె సూచనల మేరకు బుధవారం పాఠశాలను దావ వసంత పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్పు తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కారు చేపట్టిన 'మన ఊరు – మన మనబడి' పథకం పేరు మాత్రం మార్చివేసిందని, ప్రగతిని గాలికొదిలేసిందని మండిపడ్డారు. పాఠశాలలో 139 మంది విద్యార్థులకు ఒకటే టాయిలెట్ ఉండడం బాధాకరమన్నారు. తాను జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలోనే స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు ₹10లక్షలు నిధులు కేటాయించినట్టు చెప్పారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు చేయకపోగా, నిధులను సైతం జడ్పీకి తిరిగి పంపించారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలకు బాబితాపూర్ స్కూల్ ఎంపికైందని పనులు ఎందుకు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇటీవల ఓ ప్రజాప్రతినిధి తన వ్యక్తిగత అభివృద్ధి కోసం కండువా మార్చి, నియోజకవర్గ అభివృద్ధి కోసమని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఏది ఏమైనా స్కూల్లో వెంటనే టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు జలంధర్, రూరల్ మండల సమన్వయ కమిటీ సభ్యులు చిత్తరి శ్రీనివాస్, పడిగెల గంగారెడ్డి, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చిత్తారి సురేశ్, బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ గౌడ్, నాయకులు మహేశ్, సంతోశ్, సాగర్, ప్రణయ్, ప్రతాప్, సాయి ఉన్నారు.

కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రారంభోత్సవానికి ముస్తాబైన ప్రాథమిక పాఠశాల

అమ్మమ్మ-తాతయ్య జ్ఞాపకార్థం.. రామన్న ఔదార్యం

- కొదురుపాకలో జోగినపల్లి లక్ష్మీ-కేశవరావు పేరిట పాఠశాల భవనం
- సొంత నిధులతో నిర్మించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు
- నేడు రామన్న చేతులమీదుగా ప్రారంభోత్సవం

సిద్ధమైన డైనింగ్‌హాల్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఔదార్యం చూపారు. అమ్మమ్మ-తాతయ్య జోగినపల్లి లక్ష్మీ-కేశవరావు జ్ఞాపకార్థం సొంత నిధులతో పాఠశాల భవనం నిర్మించారు. కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు కల్పించారు. నేడు రామన్న చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

బోయినపల్లి, సెప్టెంబర్ 25: కొదురుపాక ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని జడ్పీ పాఠశాలలో ప్రైమరీ స్కూల్ కొనసాగేది. పక్కా భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలలోని రెండు గదుల్లో అరకొర సౌకర్యాలతో విద్యాబోధన జరిగేది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులను స్థానిక నాయకులు రెండేళ్ల క్రితం కొదురుపాక పాఠశాలకు వచ్చిన అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తన అమ్మమ్మతాతయ్య జోగినపల్లి లక్ష్మీ-కేశవరావు జ్ఞాపకార్థం తన సొంత ఖర్చులతో నూతన భవనం నిర్మిస్తానని హామీఇచ్చారు. 2022 జనవరి 10న ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. రామన్న సూచన మేరకు కార్పొరేట్‌కు దీటుగా ఆధునాతన సౌకర్యాలు కల్పించి రెండు ఫ్లోర్లలో 18 తగరతి గదుల నిర్మాణం చేపట్టారు. వంట గదితోపాటు మధ్యాహ్నం భోజనం కోసం డైనింగ్‌హాల్, కంప్యూటర్ శిక్షణ కోసం గదులు, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేశారు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్న చేతులమీదుగా పాఠశాల భవనాన్ని ప్రారంభోత్సవం చేయనున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ఆరు గ్యారెంటీలు అటకెక్కినట్టేనా..?

- దొంగ హామీలతో కాంగ్రెస్‌కు అధికారం
- 'రైతుభరోసా', కొత్త పింఛన్లు ఇంకెప్పుడిస్తరు?
- దళితబంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలి
- కల్వల ప్రాజెక్ట్ వెంటనే పూర్తి చేయాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, సెప్టెంబర్ 25: దొంగ హామీలు, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అర్హులందరికీ రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. రైతుభరోసా, కొత్త పింఛన్లు ఇంకెప్పుడిస్తారని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్టు జాడేలేదన్నారు. బుధవారం ఆయన వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా దేశాయిపల్లిలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో సుమారు 5వేల కుటుంబాలకు వెంటనే రెండో విడుత దళితబంధు నిధులు ఇవ్వాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మహిళలకు ప్రతినెలా ₹2,500 ఇవ్వాలని, వెంటనే 2లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. కల్వల ప్రాజెక్ట్ పనులు చేపట్టి వీణవంక, జమ్మికుంట, శంకరపట్నంలోని రైతులకు మేలు చేయాలని రైతుల పక్షాన దండంపెట్టి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హామీలు అమలు చేయకపోతే దసరా తర్వాత రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాడ వనమాల-సాదవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచులు మోరె సారయ్య, పోతుల నర్సయ్య, కోమాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంజీవరెడ్డి, నాయకులు సమ్మిరెడ్డి, తిరుపతి, రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, ముత్యాల శంకర్, రాపర్తి అఖిల్, రాజయ్య, దరిపెల్లి రవి, మల్లారెడ్డి, అజయ్, చరణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

పండుగలోగా పీఆర్సీ ఇవ్వండి

- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయండి
- 261జీవో సవరించి న్యాయం చేయండి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని.. కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని కోరారు. వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం బుధవారం నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారన్నారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317జీవో తీసుకువచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. కనీసం స్పౌజ్‌ను కూడా పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు. ఇటీవల తాము ₹130కోట్లు వరద బాధితులకు సాయంగా అందించామని గుర్తుచేశారు. వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, కొమరవెల్లి, బాసర ఆలయాలకు చెందిన దాదాపు 200మంది ఉద్యోగులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర దేవాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ రమేశ్‌బాబు, కో చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టీఎన్‌జీవో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, నిర్మల్, సిద్దిపేట జిల్లాల టీఎన్‌జీవో అధ్యక్షులు ఎల్సాని ప్రవీణ్, దారం శ్రీనివాస్‌రెడ్డి, మిరియాల నాగేందర్‌రెడ్డి, పరమేశ్వర్, పలు ఆలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యులుగా మాకు బాధ్యత ఉన్నది

దవాఖానలో పేషెంట్ కేస్‌షీట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- దవాఖానల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలన్నదే మా ఉద్దేశం
- జగిత్యాలలో బెడ్స్ కొరత తీవ్రంగా ఉంది
- కొందరు వైద్యులు సమయపాలన పాటించడం లేదు
- సిజేరియన్లు పెరగడం సరికాదు
- బీఆర్ఎస్ వైద్య ఆరోగ్య త్రీమెన్ కమిటీ మెంబర్ సంజయ్ కల్వకుంట్ల
- జగిత్యాల జిల్లా దవాఖాన, ఎంసీహెచ్ పరిశీలన

జగిత్యాల, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ప్రజాప్రతినిధులుగా, వైద్యులుగా తమకు బాధ్యత ఉందని, అందుకే ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా దవాఖానలను పరిశీలించి పరిస్థితులపై ప్రభుత్వం, సీఎం, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి నివేదిక ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని బీఆర్ఎస్ వైద్య ఆరోగ్య త్రీమెన్ కమిటీ మెంబర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. నిర్మాణాత్మకమైన సలహాలు ఇచ్చేందుకే హాస్పిటళ్లను పరిశీలిస్తున్నామని, తమను అడ్డుకోవడం, అరెస్ట్ చేయడం సరికాదని సూచించారు. బుధవారం ఉదయం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానతోపాటు మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. దాదాపు రెండు గంటలకుపైగా అన్ని వార్డులను పరిశీలించి,అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా రోగులు, వారి కుటుంబసభ్యులు గోడు వెల్లబోసుకున్నారు. 'సార్ కేసీఆర్ సార్ హయాంలో వచ్చినట్లు బాలింతలకు కిట్లు, రూ.12వేల పారితోషికం వస్తే బాగుండు. అస్సలు ఇవ్వడం లేదు' 'పేషెంట్‌కు యూరిన్ పైపు వేసేందుకు రూ.100 వసూలు చేస్తున్నరు. ఇదేం గోస' 'పక్షవాతం వచ్చిన రోగికి ఒకే గోలి ఇస్తున్నరు. ఇదేం వైద్యమో..? అర్థమైతలేదు' అంటూ చెప్పుకున్నారు. భోజనం శుచి, శుభ్రత లేదని, మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. వ్యాధి నయమవాలని వస్తే.. ఇక్కడి కొత్త రోగాలు వచ్చే పరిస్థితి దాపురించిందని చెప్పుకోగా, ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. దవాఖాన వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మాట్లాడారు. జగిత్యాల ప్రధాన దవాఖానను సైతం సాధారణ రీతిలోనే పరిశీలించామని, సిబ్బందికి, రోగులకు ఎక్కడ ఇబ్బందులు సృష్టించలేదని, అనవసర ఆరోపణలు సైతం చేయడం లేదన్నారు. దవాఖానలో ప్రధానంగా బెడ్స్ కొరత తీవ్రంగా ఉందని, వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యులు, స్టాఫ్ పనితీరు చాలా వరకు బాగానే ఉందని చెప్పారు. అయితే కొందరు వైద్యులు సమయ పాలన పాటించడం లేదని, కొందరు సిబ్బంది సరిగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు తమ పరిశీలనలో వెలుగులోకి వచ్చాయన్నారు. అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో నిర్మించిన మాతా శిశు సంరక్షణ కేంద్రం చాలా బాగుందని, రోగులకు సౌకర్యవంతంగా, విశాలంగా ఉందన్నారు. కేసీఆర్ కిట్, ₹12వేల పారితోషికం చాలా ఎక్కువ ప్రభావం చూపిందని, ఫలితంగా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య 70 శాతానికి చేరిందన్నారు. అయితే కొన్నాళ్లుగా కేసీఆర్ కిట్లు, పారితోషికాలను నిలిపివేయడంతో ప్రసవాల సంఖ్య తగ్గిపోవడానికి కారణమైందని వివరించారు. సకల సదుపాయాలతో ఉన్న ఎంసీహెచ్‌లో సిజేరియన్లు ఎక్కువ కావడం సరికాదన్నారు. వసతులు లేని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిజేరియన్లు జరిగాయంటే అర్థం ఉందని, అన్ని వసతులు ఉన్నచోట ఇలా జరగవద్దని, వీలైనంత వరకు సాధారణ కాన్పు అయ్యేలా చూడాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ దవాఖానలో భోజన తయారీ కేంద్రం అత్యంత బాధాకరమైన స్థితిలో ఉందని, అపరిశుభ్రత రాజ్యమేలుతుందని, ఇలాంటి చోట తయారయ్యే భోజనంలో లక్కపురుగులు రాకుంటే? ఏం వస్తాయని ప్రశ్నించారు. ఒక్కచోట భోజనం తయారు చేసి మరో చోటుకి తరలించడం సరిగా లేదన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా వైద్యుల సమయపాలనపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి తదితరులున్నారు.

ఆర్జీ-1 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

దగా చేస్తే ఊరుకోం

- ₹4,701 కోట్ల నికర లాభాలపై 33 శాతం వాటా చెల్లించాలి
- సింగరేణి యాజమాన్యంపై టీబీజీకేఎస్ కన్నెర
- రామగుండం రీజియన్ వ్యాప్తంగా నిరసనలు

గోదావరిఖని, సెప్టెంబర్ 25: 'సింగరేణి కార్మికులను దగా చేయాలని చూస్తే ఊరుకోం. ₹4701కోట్ల నికర లాభాలపై 33 శాతం వాటా చెల్లించేదాకా ఆందోళనలు చేస్తాం' అని టీబీజీకేఎస్ నాయకులు హెచ్చరించారు. కార్మికులను మోసం చేయాలని చూస్తే కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలే బాధ్యత వహించాలని అల్టిమేటం జారీ చేశారు. బుధవారం రామగుండం రీజియన్ వ్యాప్తంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నాలు చేశారు. సింగరేణి ఆర్జీ-1 కార్యాలయం ఎదుట నల్లజెండాలు చేతబూని చేపట్టిన ధర్నాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. లాభాల వాటాలో కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారని, కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, బెదిరింపులు, అదిరింపులకు భయపడబోమని తేల్చిచెప్పారు. అనంతరం జీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, ఎల్ వెంకటేశ్, ప్రవీణ్, చెలుకలపల్లి శ్రీనివాస్, ముదుంపల్లి రాజేశం, ఇందూరి సత్యనారాయణ, వాసర్ల జోసెఫ్, దూట శేషగిరి, బొగ్గుల సాయి, ఉప్పులేటి తిరుపతి, .జనగామ మల్లేశ్, అంజయ్య, లక్ష్మణ్, వెంకటరెడ్డి, అభిషేక్, కార్పొరేటర్లు కృష్ణ వేణి, గాదం విజయ, నాయకులు సంధ్యారెడ్డి, శ్రావణ్, చింటూ, రోడ్డ సంపత్, సట్టు శ్రీనివాస్ ఉన్నారు.